

ప్రారంభమైన జొన్న కోతలు



- ధర తగ్గించే ప్రయత్నం చేస్తున్న వ్యాపారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

7

- జిల్లాలో అక్రమంగా మొరం, మట్టి తవ్వకాలు
- నిత్యం ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా తరలింపు
- బొందల గడ్డలుగా ప్రభుత్వ భూములు
- మాయమవుతున్న గుట్టలు
- అధికార పార్టీ నేతల అండదండలతో యథేచ్ఛగా కొనసాగుతున్న దందా
- పట్టుకునేందుకు జంకుతున్న యంత్రాంగం

అక్రమ తవ్వకాలపై పట్టింపేదీ?



● డిచ్‌పల్లి మండల పరిధిలో మొరం తవ్వకాలు చేపడుతున్న దృశ్యం



● మొరం తరలించేందుకు సిద్ధంగా ఉన్న టిప్పర్లు

నిజామాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో అక్రమంగా మట్టి, మొరం తవ్వకాలను పట్టించుకునే వారే లేరు. ఎలాంటి అనుమతులు లేకుండానే ప్రభుత్వ భూములు, గుట్టలు కబ్జా చేస్తున్నారు. నిత్యం ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఎక్కడికక్కడ తమకు అనుకూలమైన అధికారులను ఉంచుకొని యథేచ్ఛగా సరఫరా కొనసాగిస్తున్నారు. భవన నిర్మాణాల నుంచి వెంచర్ల వరకు వీరే సరఫరా కొనసాగిస్తున్నారు. గత కొన్ని నెలలుగా పలు మండలాల పరిధిలో ఈ తవ్వకాలు కొనసాగుతున్నా అధికారులు మాత్రం ఆవైపు చూడటం లేదు. అధికార పార్టీకి చెందిన బడా నేతలు వీరికి మద్దతుగా ఉండటంతో పట్టించుకోవడం లేదు. మట్టి, మొరం తవ్వకాల వల్ల గుట్టలు మాయమవుతున్నా ప్రభుత్వ భూములు బొందలుగా మారుతున్నా ఎలాంటి చర్యలు మాత్రం ఉండటం లేదు. జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల అధికారులు వాహనాలను సీజ్ చేసి ఫైన్‌లు కొన్నిటికి వేస్తున్నా.. నేతల నుంచి ఫోన్‌లు రాగానే వదిలి వేస్తున్నారు. సీజ్ చేసిన వాహనాలను కూడా విడిచి పెడుతున్నారు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో జరుగుతుండటంతో ఎవరూ పట్టించుకోవడం లేదు.

అభివృద్ధి పనులకు పెరిగిన వినియోగం..

జిల్లాలో భవన నిర్మాణం, రోడ్లు, వెంచర్లకు మట్టి, మొరం అవసరం పెరిగింది. వేసవి కాలం కావడంతో నిజామాబాద్ నగరంతో పాటు బోధన్, ఆర్మూర్ మున్సిపాలిటీల పరిధిలో భవన నిర్మాణాలు ఊపందుకున్నాయి. వీటితో పాటు అన్ని గ్రామాల పరిధిలో కూడా కొత్తగా భవనాలు నిర్మాణం అవుతున్నాయి. వీటన్నింటికి ఇసుక, మొరం తప్పనిసరిగా అవసరం ఉంది. వీరితో పాటు బహుళ అంతస్తుల భవనాలు నిర్మాణం అవుతున్నా వీటికి వందల సంఖ్యలో లారీల మట్టి అవసరం పడుతుంది. నిజామాబాద్ నగరం చుట్టే కాకుండా అన్ని మున్సిపాలిటీలు, మండల కేంద్రాల పరిధిలో వ్యవసాయ భూములు వెంచర్లుగా మారుతున్నాయి. ఈ వెంచర్లకు భారీగా మట్టి, మొరం వినియోగిస్తున్నారు. వందల ఎకరాల్లో వెంచర్లు వెలువడం వల్ల భారీ ఎత్తున మట్టి తవ్వకాలు చేస్తున్నారు. జిల్లాలో మట్టి, మొరం తవ్వకాలకు పది మంది వరకు మాత్రమే ప్రభుత్వపరంగా అనుమతులను ఇచ్చారు. మాక్లూర్, ఎడపల్లి, డిచ్‌పల్లితో పాటు మరో రెండు మండలాల పరిధిలో తవ్వకాలకు అనుమతులను మంజూరు చేశారు. నిర్ణయించిన భూముల పరిధిలోనే అనుమతులు ఉన్న వారు తవ్వకాలను చేస్తున్నారు. వేసవి కాలం కావడం వల్ల నిర్మాణ రంగానికి మట్టి, మొరం కీలకంగా మారింది. నిజామాబాద్ నగరం చుట్టూ ఉన్న మోపాల్, ఎడపల్లి, డిచ్‌పల్లి, మాక్లూర్, నవీపేట మండలాల పరిధిలో ఎక్కువ మొత్తంలో తవ్వకాలు చేస్తున్నారు. అటవీ, ప్రభుత్వ భూములు, గుట్టల నుంచి తవ్వకాలు చేసి మట్టిని తరలిస్తున్నారు. రాత్రివేళల్లో అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున జేసీబీలతో తవ్వకాలు చేస్తూ టిప్పర్లు, లారీల ద్వారా ఈ మట్టిని, మొరాన్ని తరలిస్తున్నారు. అటవీ, ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా ఈ తవ్వకాలను కొనసాగిస్తున్నారు.

అధికార పార్టీ నేతల కనుసన్నల్లో..

జిల్లాలో మట్టి, మొరం తవ్వకాలన్నీ అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. కొత్త వెంచర్ల నుంచి భవనాల నిర్మాణం వరకు వీరే సరఫరా కొనసాగిస్తున్నారు. వీరి అనుచరుల ఆధ్వర్యంలోనే పలు ప్రాంతాల్లో ఈ తవ్వకాలు కొనసాగుతున్నాయి. ఆయా మండలాల పరిధిలోని అధికారులకు ముందే సమాచారం ఇచ్చి ఈ తవ్వకాలను కొనసాగిస్తున్నారు. టిప్పర్‌కు రూ.3వేల నుంచి రూ.5వేల మధ్యన వసూలు చేస్తున్నారు. దూరాన్ని బట్టి ధర నిర్ణయిస్తూ భారీగా దందాను కొనసాగిస్తున్నారు. అధికార పార్టీలోని వివిధ నామినేటెడ్ పదవుల్లో ఉన్న ఒకరిద్దరు నేతలు వీరికి వత్తాసు పలకడం మండల స్థాయి అధికారులను మేనేజ్ చేస్తుండటంతో ఈ దందా కొనసాగుతోంది. జిల్లాలోని పలు మండలాల పరిధిలో ఈ వ్యవహారం జరుగుతున్నా అధికారులు మాత్రం ఆపేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది అధికారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

ప్రభుత్వ అనుమతులు ఇలా..

ప్రభుత్వ అవసరాల కోసం, జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులకు, జిల్లాలోని పంచాయతీ రోడ్లు, భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం ఈ మట్టి తవ్వకాలకు అనుమతులు ఇస్తుంది. ఇవేకాకుండా ప్రభుత్వ గృహ నిర్మాణానికి కూడా అనుమతులను మంజూరు చేయనుంది. అయితే నిజామాబాద్ నగరం చుట్టూ ఉన్న అటవీ ప్రాంతంలో ఎక్కువ మొత్తంలో మట్టి తవ్వకాలను చేస్తున్నారు. నాగారం, మల్కాపూర్, మల్లారం ప్రాంతాలతో పాటు ఎడపల్లి మండలం ఠాణాకలాన్ వంటి ప్రాంతాల్లో గుట్టలను తవ్వకాలు చేసి తరలిస్తున్నారు. దేవాలయ భూములను సైతం మట్టి తవ్వకాలకు వదిలి వేయడం లేదు. నిజాంసాగర్ ప్రధాన కాలువలతో పాటు కాళేశ్వరం ప్యాకేజీలకు సంబంధించిన 20, 21 సొరంగ మార్గాలకు మట్టిని కూడా ఎలాంటి అనుమతులు లేకుండానే తవ్వకాలను కొనసాగిస్తున్నారు. నందిపేట మండలం పలుగుట్ట, మాక్లూర్ మండలం పరిధిలోని దాస్‌నగర్, మండల కేంద్రంలోని పలు గుట్టలు ఆనవాలు కోల్పోయాయి. ఆర్మూర్, జక్రాన్‌పల్లి మండలాల పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్ ప్రధాన రహదారి వెంట ఉన్న గుట్టల మట్టిని తవ్వి తరలించడం వల్ల ఇప్పటి వరకు వాటిని పట్టించుకునేవారు లేరు. గతంలో ఈ తవ్వకాలపై రాష్ట్ర విజిలెన్స్ అధికారులు కూడా తనిఖీలు చేసి చర్యలకు సిఫార్సులు చేసిన పట్టించుకోలేదు. అనుమతులు ఇచ్చిన వారు మినహా అక్రమంగా పలు మండలాల పరిధిలో ఈ తవ్వకాలు చేస్తున్నా పట్టించుకునేవారు లేరు.





మాట్లాడుతున్న డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్

మహిళా సంఘ సభ్యుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

● జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గల మహిళా సంఘాల సభ్యుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ అన్నారు. కలెక్టరేట్‌లోని సెమినార్ హాల్‌లో శుక్రవారం ఏపీఎంలు, సీసీల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆరోగ్యం, పిల్లల పోషణ, పరిసరాల పరిశుభ్రతపై మహిళా గ్రూపుల్లోని ప్రతి సభ్యులందరికి అవగాహన కల్పించాలన్నారు. మహిళలు సమతుల ఆహారం తీసుకునే విధంగా గ్రూప్ సభ్యులకు శిక్షణ ఇవ్వాలన్నారు. గ్రూప్ సభ్యుల ఆదాయం పెరిగి ఖర్చులు కూడా పెరిగాయని అన్నారు. మంచి ఆహార అలవాట్లు ప్రతి ఒక్కరు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్, రిసోర్స్ పర్సన్‌లు డీపీఎం సాయిలు, శ్రీనివాస్, ఏపీఎంలు సరోజిని, గంగాధర్, రాజేందర్‌లు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా

సదుపాయాలు ఉండాలి

● కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు



మైనారిటీ బాలికల రెసిడెన్షియల్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

రెంజల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. పోలింగ్ కేంద్రాలలో అందుబాటులో వసతులను పరిశీలించి ర్యాంప్, టాయిలెట్లు, విద్యుత్ సరఫరా, నీటి వసతి సదుపాయలను పరిశీలించారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా పోలింగ్ ప్రక్రియ జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు వేర్వేరుగా పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయగా లోటుపాట్లు లేకుండా అన్ని సదుపాయలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలలో మన ఊరు, మన బడి కింద ఇటీవల నూతనంగా నిర్మించిన తరగతి గదులను పరిశీలించారు. రెంజల్ బాలికల మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరుతో పాటు విద్యార్థుల సంఖ్యను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్‌లను పరిశీలించి బియ్యం నిల్వలు, కూరగాయల నాణ్యత, సరుకుల స్టాక్‌లను పరిశీలించారు. పాఠశాలలో 418మంది విద్యార్థినులు చదువుకుంటున్నారని పాఠశాలకు కొత్త బియ్యం నిల్వలు కేటాయించినందున వండిన సమయంలో అన్నం కొంత మెత్తగా అవుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ హర్షియానాజం కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన కలెక్టర్ సివిల్ సప్లై డీఎంకు ఫోన్ చేసి పాఠశాలలు, వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్లకు ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా పాత బియ్యం నిల్వలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల సముదాయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు చేపట్టాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రావణ్ కుమార్, రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్ రవికుమార్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



పొడిగింపు ఉత్తర్వులను అందజేస్తున్న మంత్రి తుమ్మల

సహకార సంఘాల పదవీ కాలం పొడిగింపు

● ఆరు నెలల పాటు పొడిగించిన రాష్ట్ర ప్రభుత్వం

నిజామాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలాన్ని ప్రభుత్వం ఆరు నెలల పాటు పొడగించింది. ఈ మేరకు సహకార శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఎన్నికలు జరిగి శనివారంతో ఐదేళ్లు పూర్తికానుంది. ఫిబ్రవరి 15న డైరెక్టర్లు ఎంపిక కాగా, ఫిబ్రవరి 17, 18 తేదీల్లో చైర్మన్లు, వైస్ చైర్మన్లు ఎంపిక అయ్యారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలతో పాటు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్, డైరెక్టర్ల పదవీకాలం కూడా పొడగించారు. ఉత్తర్వులకు అనుగుణంగా ఆరు నెలల పాటు డైరెక్టర్లు, చైర్మన్లు పదవుల్లో కొనసాగనున్నారు.

పల్లె వెలుగుకు నోచుకోని శ్రీరాంసాగర్ పర్యాటక కేంద్రం

- ప్రాజెక్టుకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్న పర్యాటకులు
- మినీ బస్సును ఏర్పాటు చేయాలని వేడుకోలు



7



ప్రచార జోరు

- జోరందుకున్న గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం
- విభిన్న పంథాల్లో ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థులు
- సొంత బృందాలను ఏర్పాటు చేసుకొని మద్దతు కోసం ముమ్మర ప్రయత్నాలు

నిజామాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. అభ్యర్థులు విభిన్న రీతిలో ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. గ్రాడ్యుయేట్లు, ఉపాధ్యాయ ఓటర్ల మద్దతును కూడ గట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. తాము పోటీ చేస్తున్న పార్టీల నేతల ద్వారా, సంఘాల ద్వారా ప్రచారాన్ని నిర్వహిస్తూనే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. నేరుగా ఓటర్లతో మాట్లాడే ప్రయత్నాలను తమ టీమ్‌ల ద్వారా కొనసాగిస్తున్నారు. ప్రతీరోజు ఓటర్లకు ఫోన్‌లు చేసి తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రచారానికి ఇంకా 11 రోజులే ఉండటంతో నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలోని డివిజన్‌లలో సమావేశాలు నిర్వహిస్తూ పూర్తి స్థాయిలో మద్దతు కూడగట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు.

అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ

ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈ దఫా గట్టి పోటీ ఉంది. విత్‌డ్రా తర్వాత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 56 మంది ఉండగా ఉపాధ్యాయ ఎన్నికల బదిలీ 15 మంది అభ్యర్థులు ఉన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి గట్టి పోటీ ఉండగా ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు ముగ్గురు లేదా నలుగురు నుంచే ఎక్కువగా పోటీ కనిపిస్తుంది. ప్రధాన పార్టీలు కాంగ్రెస్ నుంచి పి.నరేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి అంజిరెడ్డి, బీఎస్పీ నుంచి ప్రసన్న హరికృష్ణలు పోటీ పడుతున్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా ప్రైవేటు పాఠశాలల మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్‌సింగ్‌లతో పాటు మరో 50 మంది పోటీలో ఉన్నారు. ప్రధానంగా మూడు పార్టీల అభ్యర్థులతో పాటు ఈ ఇద్దరు స్వతంత్ర అభ్యర్థుల మధ్యనే పోటీ ఎక్కువగా కనిపిస్తుంది. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఇప్పటికే జిల్లా స్థాయిలో సమావేశాలు నిర్వహించడంతో పాటు ఎమ్మెల్సీ అభ్యర్థికి సహకరించే విధంగా ప్రయత్నాలు చేసున్నారు. బీఎస్పీ తరపున పోటీ చేస్తున్న ప్రసన్న హరికృష్ణ విద్యార్థి సంఘాలు, యువజన సంఘాల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ తరఫున మల్క కొమురయ్య పోటీ చేస్తుండగా మిగతా అభ్యర్థులందరూ స్వతంత్రంగానే పోటీ పడుతున్నారు.

ప్రచారం కోసం ప్రత్యేక టీమ్‌లు

నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ప్రచారాన్ని నిర్వహించేందుకు అభ్యర్థులకు ఇబ్బందులు ఉండటంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్య ర్థుల్లో కొంత మంది ఈ ప్రచారం కోసం అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశా రు. ఓటర్ల వివరాలను, ఫోన్ నెంబర్లను తీసుకున్నారు. ప్రతీరోజు ఈ టీమ్‌ల సభ్యులు వారికి ఫోన్‌లు చేసి తమ అభ్యర్థికి ఓటు వేయా లని అభ్యర్థిస్తున్నారు. ఈనెల 27న పోలింగ్ ఉండటం ప్రచారం ఈనెల 25 వరకే అవకాశం ఉండటంతో ఎవరికి వారే గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.

సదా మీ సేవలో...
పత్రిక సరఫరాలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నా మరియు కొత్త కాపీ బుక్ చేసుకోవడానికైనా ఈ దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు..
నిజామాబాద్ - 99490 55399
బోధన్ - 82476 24486
ఆర్మూర్ - 99085 21686
భీమ్‌గల్ - 87123 41176
అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్: 99854 11454
బ్రాంచ్ మేనేజర్ సెల్: 99854 11451

మున్సిపల్‌లో ఈకేవైసీ క్యాంప్

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మురికికాలువలు, సెప్టిక్ ట్యాంకు కార్మికుల కోసం ఈకేవైసీ క్యాంపు నిర్వహించారు. సీడీఎంఏ ఆదేశాల మేరకు ఈకెవైసీ క్యాంపు నిర్వహించి కార్మికుల డాటాను నమోదు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, సీఎస్‌సీ ఆపరేటర్ దేవేందర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

'విద్యాశాఖ మంత్రిని నియమించాలి'

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, యూనివర్సిటీలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని ఆర్మూర్ డివిజన్ పీడీఎస్‌యూ అధ్యక్షుడు అనిల్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జక్రాన్‌పల్లిలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అభినాయన్, టీమ్‌రావు, అభినయ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

ఏర్గట్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి శుక్రవారం పాఠశాలలోని తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ ఆరువేల రూపాయల విలువైన పుస్తకాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ చారి, విద్యార్థులకు వాటిని అందజేశారు. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా పుస్తకాలను అందజేసిన ప్రవీణ్ శర్మకు తోటి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పూల్వామ దాడిలో అమరులైన వీరులకు నివాళులు



నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

ముప్కాల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం పూల్వామ దాడిలో అమరులైన జవాన్‌లకు బీజేపీ నాయకులు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. 2019 ఫిబ్రవరి 14వ తేదీన పూల్వామ జవాన్‌లు ప్రయాణిస్తున్న బస్సు మందు పాత్రతో వెనుక నుంచి ఢీకొట్టి 40మంది జవాన్‌లు ప్రాణాలు బలిగొన్న భారతదేశానికి చీకటి రోజుల అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధానకార్యదర్శి గణేష్, తోట చిన్నయ్య, ఆరేపల్లి నర్సయ్య, జక్కు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కోడిచర్ల మల్లన్న సన్నిధిలో అన్నదానం

మెండోర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడిచర్ల గ్రామంలో మల్లన్న ఉత్సవాలను యాదవులు, గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా ఉత్సవాలను నిర్వహించారు. శుక్రవారం మల్లన్నస్వామిని భక్తులు అధికసంఖ్యలో దర్శించుకొని పూజలు చేసి పాడి పంటలు, వ్యాపారాలలో అభివృద్ధి చెందాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యాదవ కులస్థులు, గ్రామప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

గౌరవవేతనం ఇవ్వాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

వేల్పూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2004 నవంబర్ నెలలో ఉపాధ్యాయులు కులగణన సర్వేలో భాగంగా ఇంటింటి కుటుంబసర్వే చేసిన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు గౌరవవేతనం ఇవ్వాలని, సెకండరీ గ్రేడ్‌టీచర్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో బాలకిషన్, తహసీల్దార్ సంతోష్‌లకు వినతిపత్రం అందజేశారు. కులగణన సర్వేలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో ఇంటింటికి సర్వే చేయించారని, ఈ సర్వే చేసిన ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు రెమ్యునేషన్ అందకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఉపాధ్యాయులకు రెమ్యునేషన్ ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ఎస్‌జీటీ యూనియన్ కార్యవర్గ సభ్యుడు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బోధన్ రూరల్ సీఐ పై మహిళ ఫిర్యాదు

ఎడపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జానకంపేట గ్రామ శివారులో గల శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరైన తనపై బోధన్‌రూరల్ సీఐ విజయ్‌బాబు లాఠీతో కొట్టాడని ఆరోపిస్తూ ఎడపల్లి ఎస్సైకి శుక్రవారం ఫిర్యాదు చేసింది. రెంజల్ మండలం దూపల్లి గ్రామానికి చెందిన బోయిభాగ్య అనే మహిళ జానకంపేట శ్రీలక్ష్మీ నర్సింహస్వామి బ్రహ్మోత్సవాలకు గురువారం తన కుమారునితో కలిసి వెళ్లింది. అక్కడ ఆమె పర్సు పోయింది. ఈ విషయం అక్కడే ఉన్న మహిళా పోలీసుకు తెలిపింది. దీంతో మహిళా పోలీసు, సీఐ విజయ్‌బాబు చేరుకుని వారిని సముదాయించి పంపించారు. కాగా తన డబ్బులు, పర్సు, తాళాలు దొరకకపోతే కుమారుడితో కలిసి కోనేరులో దూకి ఆత్మహత్య చేసుకుంటానని ఆమె బెదిరించిందని, ఎంత సముదాయించినా వినక పోవడంతో మహిళా పోలీసుల తో మహిళను బెదిరించి ఇంటికి పంపించామని సీఐ విజయ్‌బాబు తెలి పారు. మహిళను కొట్టాననే అసత్య ఆరోపణలు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

సంతాప సభ గోడప్రతుల ఆవిష్కరణ

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మనోహరాబాద్ గ్రామంలో కమ్యూనిస్టు యాదగిరి సంతాపసభ గోడప్రతులను శుక్రవారం సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి బి.దేవారాం ఆవిష్కరించారు. నిజామాబాద్‌లో సోమవారం జరిగే కమ్యూనిస్టు యాదగిరి సంతాపసభకు రావాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షు డు అనిల్‌కుమార్, సబ్‌డివిజన్ కార్యదర్శి డి.కిషన్, నాయకులు మోహ న్, రాజారాం, ప్రసాద్ పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలోని టెలిఫోన్ టీడీకంపెనీ ఆవరణలో శుక్రవారం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథ ఆధ్వర్యంలో కామ్రెడ్ యాదగిరి సంతాపసభకు సంబంధించిన గోడప్రతులను టీడీ ప్యాకర్స్ ఆవిష్కరించారు. సోమవారం నిజామాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నిర్వహించే యాదరిగి సంతాపసభకు రావాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా నాయకులు సారాసురేష్, టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షురాలు సత్తెక్క, కమ్మర్‌పల్లి కార్యదర్శి అశోక్, టీడీ ప్యాకర్ ఖదీర్, పవన్ పాల్గొన్నారు.

గోదావరిలో యువకుడి మృతదేహం లభ్యం

రెంజల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందకుర్తి గోదావరి నదిలో యువకుడి మృతదేహం లభ్యమైనట్లు హెడ్‌కానిస్టేబుల్ శంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బికనెల్లి గ్రామానికి చెందిన అముల్ అనే వ్యక్తి మృతదేహం గోదావరిలో తేలడంతో అటు వైపుగా వెళ్లిన వారు మృతేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు జాల్లర్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా బంధువుల నుంచి ఎలాంటి సమాచారం లేదన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శంకర్ తెలిపారు.

హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

● ఆర్మూర్‌లో హాస్టళ్ల ఆకస్మిక తనిఖీలో అదనపు కలెక్టర్ అంకిత్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్



సుదర్శన యాగం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సబ్‌కలెక్టర్

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో గిరిజన సంక్షేమ చీమన్‌పల్లి బాలుర హాస్టల్, సాంఘీక సంక్షేమ బాలికల హాస్టల్, పిప్రి రోడ్డులో గల సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల, వేల్పూర్ సాంఘిక సంక్షేమ పాఠశాలతో పాటు పెర్కిట్‌లోని కేజీబీవీ పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని వంట సరుకులతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట గదులను శుభ్రంగా ఉంచుకోవాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని ఆయన సూచించారు. పాఠశాలల్లోని బాత్‌రూమ్‌లు ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకోవాలని, విద్యార్థులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాళ్లకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రాజు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ గజానంద్, తదితరులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలోని బీటీ నగర్‌లో గల శ్రీ కోట మైసమ్మ, లక్ష్మి నరసింహస్వామి దేవాలయంలో మార్చి 4వ తేదిన 13వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల సందర్భంగా లోక కల్యాణార్థం సుదర్శన యాగం నిర్వహించడం అభినందనీయమని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. పండుగలను, ఆలయాల ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. అనంతరం ఆలయ వ్యవస్థాపకులు పసులోటి గోపి కిషన్ మాట్లాడుతూ సుదర్శన యాగం కార్యక్రమానికి మల్లారం గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకులు పిట్ల కృష్ణ మహరాజ్ ముఖ్య అతిథిగా హజరు కానున్నారని తెలిపారు. వేద పండితులచే ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. లోక కల్యాణార్థం సుదర్శన యాగం కరపత్రాలను సబ్ కలెక్టర్‌తో పాటు ఏసీపీ శ్రీనివాస్, తహసీల్దార్ విఠల్, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, పట్టణ సీఐ వెంకట నారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పసులోటి గోపికిషన్, కమిటీ సభ్యులు కోనేటి కృష్ణ సుదర్శన్, గౌతం, విజయ్, లింగం, కుమార్, గోవింద్, అప్పాజి, ఎం.కిషోర్, కృష్ణ, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

వర్క్‌ఫ్రమ్‌హోం పేరుతో 2.35 లక్షల మోసం

నవీపేట,ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి):సెల్‌ఫోన్‌లో వచ్చిన లింకును ఓపెన్‌చేయగా గుర్తు తెలియని వ్యక్తులు మహిళ వద్ద నుంచి నాలుగు రోజులలో సుమారు 2.35లక్షల రూపాయలను తమ ఖాతాలలో జమ చేయించుకున్నారని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన ప్రకారం.. గొల్లపల్లి జ్యోతి, మధు అనే భార్యభర్తలు మండల కేంద్రంలోని రాంమందిరం సమీపంలో అద్దెకు ఉంటున్నారు. వీరి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా గనపవరం మండలం కొత్తపల్లి గ్రామం. గొల్లపల్లి జ్యోతి భర్తకు ఇటీవల రైల్వే విభాగంలో ప్రైవేటు ఉద్యోగం రావడంతో మండల కేంద్రంలో నివాసం ఉంటుంది. ఈ నెల 1న గొల్లపల్లి జ్యోతి తన ఫోన్‌లో ఇన్‌స్ట్రాగ్రామ్‌లో రీల్ చూస్తుండగా వర్క్ ఫ్రమ్ హోం అనే లింక్ కనిపించడంతో ఆమె దానిని ఓపెన్ చేసింది. కొంత డబ్బు పెట్టుబడిగా పెడితే లాభాలు వస్తాయని అవతలి వైపు వారు ఆశ చూపించడంతో ఆమె వెయ్యి రూపాయలను వారి అకౌంట్‌లకు పంపించింది. వెంటనే 1300రూపాయలు తిరిగి ఆమె ఖాతాలోకి వచ్చాయి. 2వ తేదిన 5వేలు, 3వేలు, 2వేలు, 20వేలు, 4500, 40,500 రూపాయలను గుర్తు తెలియని వ్యక్తులలోకి ఆమె డబ్బులను పంపించింది. తన అకౌంట్ బ్లాక్ అయిందని నమ్మించి అవతలి వైపు వారు 30వేల రూపాయలు, 50వేల రూపాయలు, 50వేల రూపాయలు, 30వేల రూపాయలను తమ ఖాతాలలోకి 3వ తేదీ, 4వ తేదీలలో వేయించుకున్నారు. ఇంకా డబ్బులు పంపించాలని అవతలి వైపు వారు ఆమెను కోరడంతో తాను మోసపోయినట్లు గ్రహించిన జ్యోతి 1930 నెంబర్‌కు ఫోన్ చేసి సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసింది. తనను మోసం చేసి డబ్బులు కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బోధన్‌లో షామీమ్ అక్తర్ నివేదిక దహనం



నివేదికను దహనం చేస్తున్న సమితి నాయకులు

బోధన్‌రూరల్,ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో శుక్రవారం హరిజన సుధార్ సమితి మాలసంఘం శక్కర్‌నగర్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిటీ ఛైర్మన్ షామీమ్ అక్తర్ నివేదికను దహనం చేశారు. ఈ సందర్భంగా మాలమహనాడు జిల్లా ప్రధాన కార్యదర్శి నీరడి రవి మాట్లాడుతూ నమ్ముకున్న మాలలను కాంగ్రెస్ పార్టీ నట్టేటా ముంచిందని ఆరోపించారు. మాలలను కాంగ్రెస్ పార్టీకి దూరం చేసేందుకు మందకృష్ణ మాదిగ, చంద్రబాబు నాయుడితో కుమ్మక్కై వర్గీకరణ ద్వారా మాలలకు అన్యాయం చేశారని ఆరోపించారు. 2011జనాభా లెక్కలలో ఉప కులాల గణన జరగలేదని, తప్పుడు జనాభా లెక్కలతో వర్గీకరణ చేశారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 ఏళ్లు దాటిన తర్వాత పాత లెక్కలు ఎలా తీసుకుంటారని వారు ప్రశ్నించారు. సుప్రీంకోర్టు గైడ్‌లెన్స్ ప్రకారం లెటెస్ట్ డేటా తీసుకుని మంత్రివర్గ ఉప సంఘంలో ఒక్క మాల మంత్రి కూడా లేకపోవడంతో మాలలకు అన్యాయం జరిగిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాలలకు ద్రోహం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో మాల మహనాడు బోధన్ డివిజన్ ఉపాధ్యక్షులు కారం స్వామి, హరిజన సుధారసమితి మాల సంఘం శక్కర్‌నగర్ అధ్యక్షులు పెరిక స్వామి, మాల నాయకులు పల్నాటి యాదగిరి, నీరడి అశోక్, బాలకృష్ణ, మల్లేశం, స్వామి, శ్రీనివాస్, లక్ష్మణ్, కేశవ్ పాల్గొన్నారు.

కోటగిరిలో ఉచిత వైద్య శిబిరం



కోటగిరిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కోటగిరి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మీదిగల్లి హనుమాన్ మందిరం వద్ద శుక్రవారం రవి యువసేన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బోధన్ అభయ ఆసుపత్రి, లయన్స్ కంటి ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం కొనసాగింది. బీపీ, షుగర్, సామాన్య వ్యాధులతో పాటు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. సుమారు 200 మందికి వైద్య పరీక్షలను జరిపి ఉచితంగా మందులను అందజేశారు. లయన్స్ కంటి ఆసుపత్రి మొబైల్ స్క్రీనింగ్ వాహనంలో కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. మోతెబిందు ఆపరేషన్లు, కాంటాక్ట్ ఆపరేషన్లు అవసరం ఉన్నవారికి బోధన్ కంటి ఆసుపత్రికి పంపించారు. కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ అజయ్, పూజిత, ఉదయ చంద్రిక, వర్ష, సిబ్బంది సురేష్, క్యాంప్ ఇన్‌చార్జ్ హనుమంతరావు, టి.రవి, బాబు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

సొంతగూటికి చేరిన నాయకులు

రెంజల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మాజీ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ అబ్బోళ్ల శ్రీకాంత్ శుక్రవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. గత ఎన్నికలలో బీఆర్‌ఎస్ పార్టీలో కీలకంగా వ్యవహరించిన శ్రీకాంత్ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ బోధన్ నియోజకవర్గ అధ్యక్షులు కార్తీక్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు గైని కిరణ్, సురేష్, శ్రీకాంత్ తదితరులున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం కృషివిజ్ఞాన కేంద్రం రుద్రూర్ శాస్త్రవేత్తలు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ అంజయ్య మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన పెంచుకోవాలని సేంద్రీయ వ్యవసాయపద్ధతులు అవలంబించాలని వాటివల్ల కలాగే లాభాలను ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ బీ.రాజ్‌కుమార్, విస్తీర్ణ శాస్త్రవేత్త డాక్టర్ శ్వేత, సేద్య శాస్త్రవేత్త ఎన్ స్వప్న, కమ్మర్‌పల్లి వ్యవసాయధీకారిని టీ రమ్యశ్రీ, ప్రకృతీ వ్యవసాయం చేసే రైతులు షేట్‌పల్లి అశోక్, అకుల గణేష్, కొత్తపల్లి రఘు, గడ్డం పురుశోత్తం, ఏఈవోలు శ్యామ్, వినయ్ తదతర రైతులు పాల్గొన్నారు. కాగా శాస్త్రవేత్తలు రైతుల అనుమానాలను నివృత్తి చేశారు. రైతులకు ఇంకా కావలసిన సమాచారం కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 180012 52175 ద్వార శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకునే అవకశాలు ఉంటాయలని తెలపారు.

ఆర్టీఐ క్యాలెండర్ ఆవిష్కరణ

బోధన్‌రూరల్,ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో చేతుల మీదుగా ఆర్టీఐ సమాచార పరిరక్షణ కమిటీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు భుజంగ లింగం మాట్లాడుతూ హక్కుల సాధనకై పోరాడేందుకు ఏర్పాటు చేసిన సమాచార పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి గిరిధర్, ఉపాధ్యక్షులు సాయి కిరణ్ యాదవ్, జిల్లా సహాలదారులు పావులూరి సాంబశివరావు, కార్యవర్గ నిర్వాహణ కార్యదర్శి రామకృష్ణ, ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులు సలీం, బోధన్ డివిజన్ అధ్యక్షులు పురం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బోధనా పరికరాలతో బోధన సులభతరం

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు బోధన చేసే ఉపాధ్యాయులు బోధనపరికరాలతో బోధిస్తే విద్యాబోధన సులభతరం అవుతుందని వడ్లం ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సంగమేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం వడ్లం పాఠశాల ఆవరణలో పెద్ద కొడప్‌గల్, వడ్లం పాఠశాలలకు సంబంధించిన కాంప్లెక్స్ సమావేశంలో టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా సంగమేశ్వర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు చిన్నారులకు బోధన చేసే సందర్భంలో మామూలుగా బోధన చేయడం కంటే ఏ అంశాన్ని బోధిస్తున్నారో ఆ అంశానికి సంబంధించిన బోధన పరికరాలు తయారు చేసుకుని విద్యాబోధన చేస్తే విద్యార్థులకు సులభత రమవుతుందని తెలిపారు. అంతేగాక బోధన పరికరాలతో బోధన చేయడం వల్ల విద్యార్థుల దృష్టిలో సులువుగా ఉండిపోతుందని తెలిపారు.

జుక్కల్ నియోజకవర్గం పెట్టుబడులకు అనుకూలం

● ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ నియోజక వర్గం పెట్టుబడులు పెట్టే దేశాల వారికి అనుకూలంగా ఉందని జుక్కల్ నియోజక వర్గంలో పెట్టుబడులు పెట్టాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్‌ను కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో తన స్వగృహానికి బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ వైన్ ఓవెన్ రాగా ఆయనతో బేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు జాతీయ, అంత ర్జాతీయ రాజకీయ అంశాలపై చర్చించారు. దీంతో పాటుగానే జుక్కల్ నియోజకవర్గం పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని, ఈ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగం రూపుమాపేలా చర్యలు తీసుకోవాలని తోట గారెత్‌ను కోరారు. జుక్కల్ ప్రాంతంలో వివిధ అంశాలను పరిశీలించేందుకు జుక్కల్‌కు రావాలని తోట ఓవెన్‌ను కోరగా ఆయన అంగీకరించారు. అనంతరం ఓవెన్‌కు తోట విందు ఏర్పాటు చేశారు.



బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్‌తో ఎమ్మెల్యే తోట

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. రంగారెడ్డి జిల్లా కోర్టు కాంప్లెక్స్ 9వ అదనపు జిల్లా మహిళా న్యాయాధికారిపై జీవిత ఖైదీ అనుభవిస్తున్న ముద్దాయి దాడికి పాల్పడడం సరైంది కాదని, ముద్దాయిని కఠినంగా శిక్షించాలని ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కోర్టు విధులను బహిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, కార్యదర్శి జి.అరుణ్‌కుమార్, న్యాయవాదులు పండిత్ కృష్ణ, గంగారెడ్డి, తులసీదాస్‌క్రాంతి, జగన్, నరేందర్, రమేష్, శ్రీధర్, జగదీష్, గంగాధర్, అశోక్, దేవన్న, విజయలక్ష్మీ, శ్యామ్, గణేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

భీమ్‌గల్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా చేగుంట మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సీఆర్‌పీల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సర్వశిక్ష అభియాన్ మెసెంజర్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డప్పు దిలీప్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సమగ్ర శిక్షలో పని చేస్తున్న శ్రీనివాస్, రమేష్ విధులు ముగించుకొని ఎంఆర్‌సీ చేగుంటకు చేరుకొనే క్రమంలో కల్హాల్‌పల్లి వద్ద ఆటోను ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారని విధుల్లో మరణించడంతో ప్రభుత్వం వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సీఆర్‌పీలు నరేందర్, సంతోష్, బాలరాజు, ఎంఐఎస్ రవిబాబు, సీవో నరేష్, ఐఈఆర్‌పీలు జలందర్, కిషన్ ఉన్నారు.

పిల్లల్లో క్షయవ్యాధి నిర్ధారణపై శిక్షణ



క్షయవ్యాధి నిర్ధారణపై శిక్షణ నిర్వహిస్తున్న అధికారులు

నవీపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నవీపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం 0 నుంచి 14 సంవత్సరాల లోపు పిల్లలలో క్షయవ్యాధి నిర్ధారణపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలలో రెండు వారాలకు మించి దగ్గు, రెండు వారాలకు మించి జ్వరం, రాత్రిపూట పిల్లలకు చెమట పట్టడం, పిల్లలు క్రమంగా బరువు తగ్గడం, ఆటల్లో చురుకుగా పాల్గొనకపోవడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే వారికి క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాల్సి ఉంటుందని వైద్య అధికారులు వివరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు కావ్య, ప్రవళిక, టీబీ అలెర్ట్ ఇండియా జిల్లా సమన్వయకర్త అమృత రాజేందర్, స్టేట్ నర్సు మెంటర్ ఉషారాణి, హెడ్ నర్సు రత్నకుమారి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



బేటీ బచావోపై ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని కల్దుర్కిలో శుక్రవారం జరుగుతున్న బాల్యవివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. మహారాష్ట్రకు చెందిన బాలికను కల్దుర్కి గ్రామానికి చెందిన అబ్బాయితో వివాహం చేస్తుండగా అధికారులు అడ్డుకున్నారు. మహారాష్ట్రకు చెందిన అమ్మాయి 18 సంవత్సరాలు పూర్తి కాకుండానే వివాహం చేయడం నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోపిలక్ష్మి, బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం బాలికను జిల్లా కేంద్రంలోని సీడబ్ల్యూసీ కేంద్రానికి తరలించారు.

ఆడపిల్లలు పట్టుదలతో చదివి విజయం సాధించాలి

బోధన్‌రూరల్,ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): ఆడ పిల్లలు పట్టుదలతో చదవి విజయం సాధించాలని డీహెచ్‌ఈడబ్ల్యూ జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ స్వప్న అన్నారు. శుక్రవారం బోధన్ మండలంలోని లంగ్డాపూర్ గ్రామంలో మహిళలతో కలిసి బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని ఈ సంవత్సరం టీంను ఉద్దేశించి బేటీ బచావో, బేటీ పడావో అనే ఐదు ఉద్దేశాలను తెలిపామన్నారు. ఆడపిల్లలు సమాజంలోని మగ పిల్లలతో సమానమని పేర్కొన్నారు. ఆడ పిల్లలు పట్టుదలతో చదవి మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నందిని, హెల్త్ సూపర్‌వైజర్ స్వరూప, అంగన్‌వాడీ టీచర్లు భాగ్యలక్ష్మిలతో గ్రామ మహిళలు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత కమ్మర్‌పల్లి జీసీసీ జట్టు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 14: (ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో బ్రహ్మగారి జాతర సందర్భంగా గ్రీన్‌ఫీల్డ్ ఫీల్డ్ క్రికెట్ క్లబ్ అధ్వర్యంలో గత వారం రోజులుగా కొనసాగుతున్న క్రికెట్ టోర్ని విజేతగా కమ్మర్‌పల్లి జీసీసీ జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. బాల్కొండ నియోజిక వర్గ స్థాయి క్రికెట్‌టోర్నీలో వివిధ ప్రాంతాలకు చెందిన 16 జట్లు పాల్గొన్నట్టు నిర్వహకులు తెలిపారు. శుక్రవారం కమ్మర్‌పల్లి జీసీసీ, మెండోరాజట్లు ఫైనల్‌లో తలపడగా విన్నర్‌గా జీసీజీ జట్టు నిలవగా, రన్నర్ జట్టుగా మెండోరా నిలిచింది. విజేత జట్లుకు కమ్మర్‌పల్లి ఎస్‌ఐ అనీల్ రెడ్డి ట్రోఫీతో పాటు నగదును బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో క్రీకారులతో పాటు స్కురి సురేష్ గుండోజి భరద్వాజ్, నర్సారెడ్డి పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి

భిక్కనూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పుల్వామా ఉగ్రదాడిలో అమరులైనా అమరవీరులకు శుక్రవారం భిక్కనూరు మండలకేంద్రంతో పాటుగా మండలంలోని ఆయాగ్రామాల్లో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు మండల ప్రజలు ఘనంగా నివాళులు అర్పించి పెద్దఎత్తున నినాదాలు చేశారు. ర్యాలీ నిర్వహించారు.

పిట్లం : ప్రవేటు రిచ్‌మైండ్ పాఠశాలలో శుక్రవారం వీర జవాన్లకు ఆత్మకు శాంతి కలగాలని విద్యార్థులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. జమ్ముకాశ్మీర్ పుల్వామా అమరవీరులు 40 మంది జవాన్లను స్మరిస్తు నివాళులు అర్పించామని ప్రిన్సిపాల్ కిషన్ తెలిపారు.

క్రీడలతో శారీరక మానసిక వికాసం

లింగంపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో శారీరక మానసిక వికాసం జరుగుతుందని మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫీ యొద్దీన్ అన్నారు. ఆయన శుక్రవారం లింగంపేట మండలంలోని మాలో త్‌తండాలో సేవాలాల్ జయంతి సందర్భంగా నిర్వహించిన కబడ్డి టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రిడాకారులకు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు రవీందర్, గణప్రస్, రమేష్‌లతో పాటు గిరిజనులు పాల్గొన్నారు.

'సీఎంవో ఆదేశాలను పట్టించుకోని కమిషనర్'

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సీఎంవో ఆదేశాలు మున్సిపల్ కమిషనర్ పట్టించుకోకుండా ఏకచత్రాధిపత్యంగా ప్రవర్తిస్తున్నారని బీజేపీ మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ జీవీనర్సింహరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. మున్సిపల్‌లో జరిగిన అవినీతి, అక్రమాలు, అక్రమ ఇంటి నెంబర్‌ల కేటాయింపు, దొంగబిల్లులతో మొరం తరలిస్తూ, కాలం చెల్లిన వాహనాలను కొనుగోలు చేయడంతో పాటు పలు అంశాలపై గత ఏడాది నవంబర్ సీఎం కార్యాలయంలో ఫిర్యాదు చేశానన్నారు. దానికి స్పందించిన సీఎంఓ సెల్ జనవరి 17న విచారణ చేయాలని ఆదేశాలను జారీ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఉత్తర్వులను పంపారు. దానిపై ఇప్పటి వరకు మున్సిపల్ కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తూ ఉత్తర్వులను పట్టించుకోక పోవడం సిగ్గుచేటని అన్నారు.

జర దేఖో!!



శిథిలావస్థకు చేరిన ఫత్తేపూర్ శివారులోని ఇరుకు వంతెన

ఇరుకు వంతెనతో ఇబ్బందులు

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫత్తేపూర్ గ్రామశివారులో ఇరుకు వంతెనతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. 44వ జాతీయ రహదారి నుంచి ఫత్తేపూర్, సుర్బిర్యాల్ మీదుగా కోమన్‌పల్లి వరకు ఇటీవల బీటీ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చారు. ఫత్తేపూర్ శివారులో వంతెన శిథిలావస్థకు చేరడమే గాకుండా ఇరుకుగా ఉండడంతో కొత్త వంతెన నిర్మించాలని పరిసర గ్రామాల ప్రజలు ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించారు. రూ.11కోట్లు వెచ్చించి బీటీ రోడ్డు నిర్మించినప్పటికీ వంతెనకు మాత్రం నిధులు మంజూరు చేయలేదు. ఇరుకు వంతెన మూలంగా గతంలో పలువురు ద్విచక్ర వాహన దారులు ప్రమాదానికి గురై ఆస్పత్రుల పాలయ్యారు. శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రారంభమైన జొన్న కోతలు

● ధర తగ్గించే ప్రయత్నం చేస్తున్న వ్యాపారులు ● ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



ఎర్రజొన్న పంట

డొంకేశ్వర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎర్రజొన్న, తెల్లజొన్న పంట కోతలు ప్రారంభమయ్యాయి. మండలంలో అధిక సాగు చేశారు. జొన్న పంటను హార్వేస్టర్‌తో కొయ్యడంతో పాటు తెల్లజొన్నను కూలీల చేత కోయిస్తున్నారు. అలా కోసిన తెల్లజొన్నను మళ్లీ హార్వేస్టర్‌తో పట్టి గింజలను బయటకు తీస్తారు. డొంకేశ్వర్ మండలం వ్యాప్తంగా 750ఎకరాల్లో జొన్న పంటను రైతులు సాగు చేశారు. స్వల్పకాలిక పంట తక్కువ పెట్టుబడితో సాగు చేస్తున్న పంట కావడంతో రైతులు జొన్న వైపే మొగ్గు చూపారు. ఎకరానికి 16నుంచి 20క్వింటాళ్ళ దిగుబడి వస్తుందన్నారు. ప్రస్తుతం ఎర్రజొన్న పంట క్వింటాలుకు రూ.3700, తెల్లజొన్న పంటకు క్వింటాలుకు రూ.3020 పలుకుతుంది. రైతుల నుంచి జొన్న కొనుగోలు చేసే సమయంలో చెప్పిన ధర కాకుండా జొన్నలను బస్తాల్లో నింపిన తర్వాత 100 నుంచి 200వరకు తగ్గిస్తూ విక్రయిస్తున్నారు. బస్తాల్లో నింపిన తర్వాత రైతులు ధర తగ్గిందని చెప్పడంతో రైతులు ఏం చేయలేక వ్యాపారులకు జొన్నలను విక్రయిస్తున్నారు. మండలంలో కొన్ని గ్రామాల్లో మాత్రమే జొన్నలు కొనుగోలు ప్రారంభమయ్యాయి. జొన్నలను గతంలో ఉన్న ధర కంటే ప్రస్తుతం తగ్గించి జొన్నలను కొనుగోలు చేస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. జొన్న కోతలు ఊపందుకోవడంతో దళారులు ధర తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని రైతుల ఆరోపించారు. జొన్నలకు ధర తగ్గకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



హార్వేస్టర్‌తో కోయిస్తున్న ఎర్రజొన్న పంట

జొన్నలకు ధర తగ్గకుండా చూడాలి

● మల్లారెడ్డి, రైతు, డొంకేశ్వర్



జొన్నలకు కనీసం రూ.4వేల ధర ఉంటే రైతుకు గిట్టుబాటు అవుతుంది. పెరిగిన ఖర్చులతో పోల్చుకుంటే ప్రస్తుతం కొనుగోలు చేస్తున్న ధరలు రైతులకు గిట్టుబాటు కావడంలేదు. వ్యాపారులు రేట్లు తగ్గిస్తూ కొనుగోలు చేస్తే రైతుల నష్టపోతారు. అధికారులు చర్యలు చేపట్టాలి. రైతులకు నష్టం కాకుండా చూడాలి.



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు కమ్మర్‌పల్లి విద్యార్థి ఎంపిక

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో కమ్మర్‌పల్లి ఎస్‌వీఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థి తూం శివచరణ్ షాట్‌పుట్ బాలుర విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపిక అయినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఏనుగు గంగారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని నాగారంలోని రాజారాం స్టేడియంలో నిర్వహించిన అండర్ 14, అండర్ 13 బాలుర, బాలికల విభాగంలో తూం శివచరణ్ జిల్లా స్థాయి ప్రథమ స్థానంలో నిలువగా అథ్లెటిక్ క్రీడల్లో లాంగ్‌జంప్, షాట్‌పుట్ తదితర విభాగాల్లో అసమాన క్రీడా ప్రతిభను కనబర్చిన తమ పాఠశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌లో రెండోస్థానంలో నిలిచినట్లు తెలిపారు. కాగా ఈ నెల 18, 19 తేదీల్లో ఉస్మానియా యూనివర్శిటీలో నిర్వహింపబడే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన శివచరణ్‌తో పాటు విజేతలుగా నిలిచిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం తరఫున అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కో ఆర్డినేటర్ జాను సుందర్, పవన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ఆదర్శాలను బడ్జెట్ కేటాయింపుల్లో ఆవిష్కరించాలి

● టీయూ రిజిస్ట్రార్ యాదగిరి



టీయూలో కేంద్ర బడ్జెట్ కార్యక్రమంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ యాదగిరి

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ ఆదర్శాలు అయిన పేదరిక నిర్మూలన ఆర్థిక అసమానతలు రూపుమాపడం, నిరుద్యోగ నిర్మూలన, అక్షరాస్యత పెంపు, సాంకేతిక నైపుణ్యం అభివృద్ధిపై, బడ్జెట్ కేటాయింపులు ఉండాలని ప్రొ.యాదగిరి పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీలో అప్లైడ్ ఎకనామిక్స్ ఏ.పున్నయ్య, అధ్యక్షతన 2025-26 కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో భారత ఆర్థిక వ్యవస్థపై కేంద్ర బడ్జెట్ ప్రభావం అనే అంశంపై రిజిస్ట్రార్ ప్రసంగిం చారు. భారత ఆర్థిక వ్యవస్థ అనేక అడ్డంకులు అధిరోహించుకుంటూ అభివృద్ధిలో ముందుకు పోతుందన్నారు. వ్యవసాయ రంగానికి ప్రాధన్యత ఇస్తునే పారిశ్రామిక సేవా రంగాలను వేగంగా అభివృద్ధిలోకి తీసుకెళ్తున్నయన్నారు. రెవెన్యూ, రాబడి కంటే, వ్యయం అధికంగా ఉందని దీనిని తగ్గించుకోవాలన్నారు. మూల ధన వ్యయం అధికంగా ఉన్న దేశాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని రిజిస్ట్రార్ తెలిపా రు. పరిశ్రమలకు డీజ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రక్రియ ద్వారానో పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్ షిప్ ద్వార పరిష్కరించి దేశ అభివృద్ధికి దోహదపడే నిర్ణాయాలు తీసుకోవలన్నారు. భవిష్యత్తులో సంస్కరణలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరతి, డీన్ రాంబాబు, ఆంజనేయులు, రవీందర్‌రెడ్డి, స్వప్న, సంపత్, రామలింగం, నర్సయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ మహరాజ్, రామారావు విగ్రహాల ప్రతిష్ఠాపన

● నేడు వివేక్‌నగర్ తండాలో జరగనున్న సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతికి ఎమ్మెల్యేను ఆహ్వానించిన గిరిజన నాయకులు



ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని కలిసి ఉత్సవాలకు రావాలని ఆహ్వానిస్తున్న దృశ్యం



మంగళహారతులతో ఊరేగింపుగా వెళ్తున్న గిరిజన మహిళలు



విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేస్తున్న గిరిజన నాయకులు

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నేడు మండలంలో జరగనున్న సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలకు రావాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి శుక్రవారం లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చౌహాన్‌మోహన్‌నాయక్ ఆహ్వాన పత్రం అందజేశారు. ప్రతీ గ్రామంలో బంజార బిడ్డలను కలుపుకొని పోవాలని బోగ్‌బండార్ కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. మండలంలోని వివేక్‌నగర్‌తాండా గ్రామంలో శ్రీసంత్‌సేవాలాల్ మహరాజ్, రామారావు మహరాజ్ విగ్రహాలను ప్రతిష్ఠిం చారు. గ్రామంలో విగ్రహాలను ఊరేగింపు నిర్వహించి జగదాంబ ఆలయంలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గిరిజన మహిళలు మంగళహారతులతో ఊరేగింపుగా వెళ్ళి శ్రీ సంత్ సేవాలాల్, రామారావు మహరాజ్ విగ్రహాలకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాలను గిరిజన నాయకులు, మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన లంబడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చౌహాన్‌మోహన్‌నాయక్, ఉపాధ్యక్షుడు విఠల్‌నాయక్, యూత్ జనరల్ సెక్రెటరీ రవినాయక్, ఇన్‌చార్జీ హరిచంద్‌నాయక్, భీమ్‌గల్ మండల యూత్ అధ్యక్షుడు బూక్యా రమేష్ నాయక్, ధర్పల్లి యువ నాయకుడు హస్సర్ నాయక్, జక్రాన్‌పల్లి మాజీ వైస్ ఎంపీపీ జితేందర్ నాయక్, వివేక్‌నగర్ తండా గ్రామస్థులు పాల్గొన్నారు.



సీతారాముల నాగవెల్లి కార్యక్రమం నిర్వహిస్తున్న పురోహితులు

ఘనంగా సీతారాముల నాగవెల్లి

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలల్లో భాగంగా శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకుడు దేశ్ పాండే ఆధ్వర్యంలో నాగవెల్లి కార్యక్రమం ఘనంగా జరిగింది. అంతకు ముందు ఆలయంలో ఉద్వాసన బలి, నివేదన, హారతి మంత్ర పుష్పం, నాగవెల్లి దండాలంకరన, ఏకాంత సేవ, కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో నాగవెల్లి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జంగం శాంతయ్య, గడ్డం నర్సారెడ్డి, పోశెట్టి సురా మాధురి, ఆసాది జితేందర్, వీడీసీ సభ్యులు బూస సుదర్శన్, యాదగిరి, యూత్ సభ్యులు పాల్గొన్నారు. శనివారం ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు నాగవెల్లితో ముగిసాయి.



పురోహితుల నృత్యాలు

అల్లకొండ ఖిల్లాను సందర్శించిన విద్యార్థులు

ముప్కాల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా అల్లకొండ ఖిల్లాను సందర్శించారు. శుక్రవారం మండలంలోని కృష్ణవేణి, మైనారిటీ రెసిడెన్షియల్, శాంబవి, నవీన్ పాఠశాలలతో పాటు ఇతర పాఠశాలల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాముఖ్యతను రచయిత కంకణాల రాజేశ్వర్ విద్యార్థులకు వివరించారు. విద్యతో పాటు ఊరి చరిత్రను తెలుసుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. 1059 ఏళ్ల కొండయ్య, మల్లయోధుల ద్వారా ఊరి నిర్మాణం జరిగిందని, తర్వాత 1101లో ఢిల్లీ పాలకుల ద్వారా ఆక్రమానికి గురైందని, అనంతరం కాకతీయ పాలనలో పలు నిర్మాణాలు జరిగాయని, దేశంలో రోజో రాజధాని అని చరిత్ర గురించి వివరించారు. ఈ ఖిల్లాలో అత్తాకొడళ్ల బావి, రాజుల స్థలాలను, పురాతన కట్టడాలను విద్యార్థులకు చూయించారు. ఈ కార్యక్రమంలో సమితి సంయుక్త కార్యదర్శులు బ్రహ్మరౌతు నర్సింగ్‌రావు, సంతోష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు వివరిస్తున్న నర్సింగ్‌రావు

నేటి నుంచి హనుమాన్ మందిర విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



ఇబ్రహీంపూర్ శివారులో నూతనంగా నిర్మించిన భక్త హనుమాన్ ఆలయం



ఎడపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామ శివారు రైతులు, ఎడపల్లి గ్రామ ప్రజలు కలిసి సంయుక్తంగా నిర్మించిన భక్త హనుమాన్ మందిర ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నేటి నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇబ్రహీంపూర్ శివారులో శిథిలావస్థలో ఉన్న హనుమాన్ ఆలయాన్ని తొలగించి అదే స్థానంలో నూతన ఆలయ నిర్మాణం చేపట్టామని తెలిపారు. హనుమాన్ ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నేటి నుంచి 17వ తేదీ వరకు ఎడపల్లి గ్రామ పురోహితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలి రోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, గోనంతపూజ, నవగ్రహపూజ, యజ్ఞశాల ప్రవేశము, దేవత హవనము, జలాదివాసం, గణపతి హవనం, 16వ తేదీన అవహీత దేవపూజ, మండప దేవత హవనం, ధాన్యదివాసం, శయ్య దివాసం, మంత్ర పుష్పం, 17వ తేదీన అవహీత దేవత పూజ, క్షేతపల, బలిపూజ, ప్రతిష్ఠాపణ, పూర్ణహారతి, మహా ప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో ఈ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆ భగవంతుని ఆశీస్సులు పొందాలని కోరారు.

పల్లె వెలుగుకు నోచుకోని శ్రీరాంసాగర్ పర్యాటక కేంద్రం

● ప్రాజెక్టుకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్న పర్యాటకులు ● మినీ బస్సును ఏర్పాటు చేయాలని వేడుకోలు

మెండోర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వివిధ జిల్లాల నుంచి వచ్చే పర్యాటకులకు జాతీయరహదారి నుంచి ప్రాజెక్టుకు వెళ్లడానికి పల్లె వెలుగు మినీబస్సులు లేక పర్యాటకులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాథనిక పోచంపాడ్ గ్రామప్రజలు విద్యార్థులు బ్యాంక్ పనుల నిమిత్తం, నిత్యవసర సరుకుల కోసం ప్రతీరోజు నిర్మల్, ఆర్మూర్ ప్రాంతాలకు వెళ్తుంటారు. వీరికి ప్రైవేటు వాహనాలే దిక్కుగా మారింది. దీంతో వేసవి సెలవులు రావడంతో హైదరాబాద్, కరీంనగర్, జగిత్యాల్, మెదక్, ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి జిల్లాల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. వీరికి ప్రాజెక్టుకు వెళ్లడానికి బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నారు. పర్యాటకులను దృష్టిలో పెట్టుకొని జాతీయరహదారి నుంచి ప్రాజెక్టు వరకు ఆర్టీసీ అధికారులు మినీ పల్లె వెలుగు బస్సు ఏర్పాటు చేస్తే పర్యాటకులు ఇబ్బందులుపడే అవ కాశం ఉండదు.

తరచూ ప్రమాదాలతో పర్యాటకుల భయాందోళనలు

ప్రాజెక్టు తిలకించి నెహ్రూ పార్కులో సేద తీరడానికి రాష్ట్రంలో నలుమూలల నుంచి పర్యాటకులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. దీంతో 44వ జాతీయరహదారి నుంచి ప్రాజెక్టు వరకు ప్రైవేటు వాహనాలు పదుల సంఖ్యలో నిత్యం నడుస్తుంటాయి. దీంతో ప్రాజెక్టు వెళ్లేటప్పుడు ఏదో ఒక చోట తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో పర్యాటకులకు అధికార యంత్రానికి ప్రమాదాలతో తలనొప్పిగా మారింది. యువత బైక్‌లపైన పెద్ద సంఖ్యలో స్పీడ్‌తో వెళ్తూ ప్రైవేటు వాహనాలను ఢీ కొట్టుతూ ప్రమాదాల భారిన పడుతున్నారు. ప్రైవేటు వాహనాలు సైతం జాతీయ రహదారి నుంచి ప్రాజెక్టుకు వెళ్లడానికి విచ్చలవిడిగా దో చుకుంటున్నారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

అధికార యంత్రాంగం ప్రైవేటు వాహనాలను అరికట్టాలి

సుదూర ప్రాంతాల నుంచి ప్రాజెక్టు అందాలను తిలకించడానికి వచ్చే పర్యాటకులకు పోచంపాడ్ గ్రామానికి చెందిన విద్యార్థులు, ప్రజలు జాతీయ రహదారి నుంచి గ్రామానికి చేరుకోవాలంటే ప్రైవేటు వాహ నాలే దిక్కు. అంతేగాకుండా ప్రైవేట్ వాహనాల్లో వెళ్తూ తరచు ప్రమా దాలకు గురవుతున్నారనీ అధికార యంత్రంగం ప్రైవేటు వాహనాలను అరికట్టాలని పర్యాటకులు కోరుతున్నారు. పోచంపాడ్ గ్రామనికి చెందిన పాఠశాల విద్యార్థులు, జునియర్ కళాశాల, బీఈడీ, పాల్‌టెక్నిక్ చదువు తున్న విద్యార్థులు కూడా ప్రైవేటు వాహనాల్లో వెళ్తూ అధిక చార్జీలు చెల్లించాల్సి వస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేస్తే బస్‌పాస్‌లతో తక్కువ ఖర్చు అవుతుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ప్రాజెక్టుకు వెళ్ళడానికి ఆర్టీసీ బస్సులు లేక నిరుత్సాహనికి గురవుతున్నారు. చేసేది ఏమి లేక ప్రైవేటు వాహనాల్లో వెళ్లడానికి అధిక చార్జీలు చెల్లించి ప్రాజెక్టుకు వెళ్తున్నారు. ఆర్టీసీ అధికారులు వేసవి సెలవులు రాకముందే పర్యాటకులను దృష్టిలో పెట్టుకొని నడిపితే పర్యాటకులకు స్థానిక ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు.



ప్రాజెక్టు దిగువన నెహ్రూ పార్కు



పల్లె వెలుగు మినీ బస్సు





ఇందిరమ్మ ఇళ్ల నమూనాకు శ్రీకారం



ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ చేస్తున్న అధికారులు

ధర్పల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో చేపట్టే ఇందిరమ్మ ఇళ్లకు నమూనాగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో హౌజింగ్ అధికారులు మార్కింగ్ ఇచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో గల ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో హౌజింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీప్రభు, అసిస్టెంట్ ఇంజనీర్ సత్యనారాయణలు మండలంలో చేపట్టే ఇందిరమ్మ ఇళ్లకు నమూనాగా నిర్మించనున్నట్లు వారు పేర్కొన్నారు. 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇందిరమ్మ ఇంటిని చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వం ఒక్కో ఇంటికిగాను రూ.5లక్షలు మంజూరు చేయనుంది. ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తవడంతో ఇందిరమ్మ ఇళ్ల నమూనాకు శ్రీకారం చుట్టింది. కార్యక్రమంలో ఎంపీడీవో బాలకృష్ణ, ఎంపీవో రాజేష్, పాల్గొన్నారు.

పుదారి గంగాధర్‌కు బెస్ట్ లీడర్ అవార్డు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ 327 ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పుదారి గంగాధర్‌కు బెస్ట్‌లీడర్ అవార్డు వరించింది. దీంతో పాటు బెస్ట్ ఫైనాన్షియల్ సపోర్ట్ అవార్డు కూడా కంపెనీ పెద్దలు అందజేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఐఎన్‌టీయూసీ 327 కార్యవర్గ సమావేశంలో కార్మికనేత సంజీవరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. పుదారి గంగాధర్‌కు అవార్డు రావడం పట్ల జిల్లాకు చెందిన యూనియన్ నాయకులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వినాయక్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టౌన్-3 ఏడీఈ వీరేశం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని గాయత్రీనగర్, ఆకులపాపయ్య కాలనీ, కాశీనగర్, సాయికృపానగర్, న్యాల్‌కల్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దామోదరం సంజీవయ్యకు నివాళి



నివాళులు అర్పిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఎంతో పాటు ఆయన సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనతో పాటు పలువురు కార్పొరేషన్ ఛైర్మన్లు, ఎమ్మెల్యేలు పాల్గొని దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

లంచం తీసుకున్న పంచాయతీ కార్యదర్శికి జైలు శిక్ష

ఖిల్లా,ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకున్న కేసులో కోటగిరి మండల పంచాయతీ కార్యదర్శి జీఎం.సుదర్శన్‌కు ఏడాది కఠిన కారాగార శిక్షతో పాటు రూ.40వేల జరిమానాను విధిస్తూ నాంపల్లి ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి మహ్మద్ అఫ్రోజ్ అఖ్తర్ శుక్రవారం తీర్పు చెప్పినట్లు ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కోటగిరి మండలానికి చెందిన వడ్డే నర్సింహులు తన తండ్రి పేరున ఉన్న ఇళ్లను తన పేరున, తన సోదరుడి పేరున మార్చడానికి కార్యదర్శి రూ.10 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితులు రూ.8 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. డబ్బులు ఇవ్వడం ఇష్టం లేకపోవడంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఏసీబీ అధికారులు 21 ఏప్రిల్ 2014వ తేదీన లంచం డబ్బులు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసును ఏసీబీ తరఫునా స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.ఎల్.మనోజ్ఞ వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు పైవిధంగా తీర్పు వెలువడించింది. ఒకవేళ జరిమానా డబ్బులు చెల్లించని యెడల నెల సాధరణ కారాగార శిక్ష విధించామని తీర్పులో చెప్పినట్లు చెప్పారు.

ఎస్ఎఫ్ఐ నగర మహాసభలను జయప్రదం చేయాలి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న జరిగే నగర మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విఘ్నేష్ పిలుపునిచ్చారు. ఈనెల 16న నిర్వహించే మహాసభలకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫీస్‌లో నిర్వహించే 16వ నగర మహాసభలకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరుకావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం చేసిందని కొటారి కమీషన్ ప్రకారం 10 శాతం నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, సాయి, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా ఉద్యమాలకు దిక్సూచి కామ్రేడ్ యాదగిరి'



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు కామ్రేడ్ యాదగిరన్న సంతాపసభను పార్టీ నిజామాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో డిచ్‌పల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజా ఉద్యమాలకు యాదగిరన్న దిక్సూచి లాంటివాడన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి వెంకన్న, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ సహాయ కార్యదర్శి సాయన్న, సీఎల్‌పీ జిల్లా కార్యదర్శి రవీందర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నిరుపేద యువతికి ఆర్థిక సాయం

ఎడపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచారం గ్రామానికి చెందిన నిరుపేదకుటుంబం గైనిసురేష్, లలితల కనిష్ట పుత్రిక నీరజ పెళ్ళికి మీ కోసం మేము సేవా సంస్థ శుక్రవారం ఆర్థిక సాయాన్ని అందించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోచారం మాజీ సర్పంచ్ కోల ఇంద్రకరణ్ గైని సురేష్ కుటుంబం నిరుపేద కుటుంబం అతని కూతురి పెళ్ళికి ఇబ్బంది పడుతున్నాడని సంస్థ వ్యవస్థాపకులు రఘుపతి లక్ష్మయ్యకు తెలుపగా తక్షణమే స్పందించి పది వేల రూపాయలను ఆ కుటుంబానికి అందించారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్ట్

ఖిల్లా/డిచ్‌పల్లి, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి):ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను డిచ్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేసినట్లు నిజామాబాద్ ఏసీపీ ఎల్.రాజవెంకట్‌రెడ్డి తెలిపారు. వివరాలను శుక్రవారం ఆయన చాంబర్‌లో డిచ్‌పల్లి సిఐ, ఎస్ఐలతో కలిసి వెల్లడించారు. ఈనెల 13గురువారం మెంట్రాజ్‌పల్లి సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా వెళ్తున్న జాదవ్ వంశీకృష్ణ, ఆకోజి అభిలాష్‌లను అదుపులోకి తీసుకుని విచారణ చేయగా వారి వద్ద సుమారు 500ల గ్రాముల గంజాయి లభించిందన్నారు.గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారు గంజాయిని అమ్ముతున్న తుకారంరాథోడ్, తాళ్లప్రమోద్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 400ల గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరి వద్ద నుంచి మొత్తం 900ల గ్రాముల గంజాయి, 4సెల్‌ఫోన్లు, 1ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న నిజామాబాద్ ఏసీపీ రాజవెంకట్‌రెడ్డి

కోరట్‌పల్లి గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

● రూరల్ ఎమ్మెల్యే డా భూపతి రెడ్డి

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కోరట్‌పల్లి గ్రామంలో గ్రామస్థులంతా ఐక్యతకు మారుపేరుగా నిలుస్తు గ్రామ అభివృద్ధిలలో రాజకీయలకు అతీతంగా పాలొనడం ప్రశంసనీయమని కోరట్‌పల్లిలో సమస్యలను సాధ్యనమైనంత త్వరగా పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కోరట్‌పల్లిలో పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఎన్నిక సమయంలోనే రాజకీయాలు చేస్తూ మిగతా సమయంలో గ్రామ అభివృద్ధికి కలిసి కట్టుగా కృషి చేస్తున్న గ్రామస్థులను అభినందించారు. కోరట్‌పల్లి కాలువ మరమ్మతుల కోసం చివరి ఆయకట్టుకు నీరు అందేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముదిరాజు సంఘం సభ్యులు, మహిళలు బోనాలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రతినిధులు జహూర్, రాకేశ్, గంగాధర్, చిన్నురెడ్డి, ఉషన్న, హన్మండ్లు, గణేశ్, ఇమ్మడి గోపి, రాంచందర్ గౌడ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న సంఘ సభ్యులు

స్ఫూర్తిదాయకం.. సేవాలాల్ మహరాజ్ జీవితం

● ఉపవాస దీక్షతో ఆరాధించనున్న బంజారాలు
● నేడు సేవాలాల్ మహరాజ్ జయంతి

నిజామాబాద్ కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బంజారాల సమాజ అభివృద్ధి చైతన్యానికి కృషి చేసి తన జీవితం అర్పించిన సేవా లాల్ మహరాజ్ స్ఫూర్తిదాయకంగా నిలిచారు. బంజారాలకు ఆరాధ్య దైవంగా కొలిచే సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాన్ని శనివారం జరుపుకోనున్నారు. నాటు పరిస్థితులల్లో బంజారాలలో చైతన్యాన్ని నింపి ఉన్నత స్థితికి చేరుకునే విధంగా కృషి చేశారు. సేవాలాల్ మహరాజ్ దేవిమాతను కొలుస్తూ ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తూ బంజారాలకు ఆదర్శంగా నిలిచాడు. ప్రతి ఒక్కరు సన్మార్గంలో నడవాలని బంజారులంతా చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని చెప్పి ఆధ్యాత్మిక వికాసాన్ని పెంపొందించేందుకు కృషి చేశారు. వ్యాధిగ్రస్తులకు ఆపదలో ఉన్న వారికి సేవ చేస్తూ మనవ సేవయే మాధవ సేవ అని నిరూపించారు. సేవాలాల్ జీవితం నేటి యువతకు ఆదర్శంగా నిలిచే విధంగా ఆయన జన్మదినాన్ని ప్రతియేటా బంజారాలు ఎంతో వేడుకగా నిర్వహిస్తారు. సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని బంజారాలు తమ ప్రాంతాల్లో మండల దీక్షను పాటిస్తూ ప్రత్యేక పూజలు చేస్తారు. జయంతి రోజున ఆయన నిత్యం ఆరాధించే దేవి మాతతో పాటు సేవాలాల్ మహరాజ్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాదాలు ఏర్పాటు చేస్తారు. జిల్లా వ్యాప్తంగా సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని ఆయా గ్రామాల్లో కొలువుదీరిన దేవిమాత ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



మాట్లాడుతున్న జగన్మోహన్‌గౌడ్

నిజామాబాద్ లీగల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నేరాలలో నేర నిరూపణ అయిన దోషులు న్యాయమూర్తుల పట్ల హింస ప్రవృత్తితో ప్రవర్తించడాన్ని సహించబోమని నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా కోర్టులో అదనపు జిల్లా న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న హరిషపై ఒక కేసులో నేర నిర్ధారణ అయిన దోషి ఒక వస్తువుతో దాడికి పాల్పడడం ఆందోళన కరమని అన్నారు. సదరు నేర ఘటనను నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లా కోర్టు ప్రాంగణంలో బార్ సమావేశపు హాల్‌లో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో ఇలాంటి నేరపూరిత ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళ న్యాయమూర్తిపై దాడి న్యాయవ్యవస్థపై దాడిగా ఆయన అభివర్ణించారు. న్యాయమూర్తులకు అండగా న్యాయవాద సమాజం ఉంటుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ నిందితుల ముందస్తు సమాచారం తీసుకొని కోర్టులోకి భద్రత సిబ్బంది అనుమతిం చాలని తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం విధులకు హాజరు కాకుండా నిరసన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ న్యాయవాదులు గణపతి, గంగాధర్, ప్రసా ద్, ఆశనారాయణ, శంకర్, బార్ ఉపాధ్యక్షుడు రాజు, కార్యదర్శి సురేష్, న్యాయవాదులు దీపక్, మానిక్‌రాజు, సాయిరెడ్డి, సదానంద్‌గౌడ్, రత్నాకర్‌రెడ్డి, విఘ్నేష్ పాల్గొన్నారు.

ఏడుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

● ఎన్నికల శిక్షణకు డుమ్మా కొట్టినందు వల్లే

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారుల శిక్షణ తరగతులకు గైర్హాజరైన ఏడుగురు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈనెల 12న నిర్వహించిన శిక్షణ తరగతులకు జిల్లా పరిషత్ తొర్లికొండ పాఠశాల స్కూల్ అసిస్టెంట్ కె.సాయిలు, జెడ్పీహెచ్ఎస్ బ్రాహ్మణపల్లి స్కూల్ అసిస్టెంట్ ఏ.గంగాధర్, జెడ్పీహెచ్ఎస్ మునిపల్లి స్కూల్ అసిస్టెంట్ విజయేందర్‌రెడ్డి, జెడ్పీహెచ్ఎస్ (జి) మోర్తాడ్ స్కూల్ అసిస్టెంట్ కె.వినోద్, జెడ్పీహెచ్ఎస్ సంగెం స్కూల్ అసిస్టెంట్ రాంచందర్, జెడ్పీహెచ్ఎస్ మోస్రా ప్రధానోపాధ్యాయుడు బాలాజీరావు, ఎంపీయూపీఎస్ అంబెం స్కూల్ అసిస్టెంట్ మనోజ్‌లు శిక్షణ తరగతులకు గైర్హాజరు కావడంతో డీఈవో షోకాజ్ నోటీసులు ఇచ్చారు. రెండు రోజుల్లో సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

సమయానికి రాని ఉపాధ్యాయుల ఒక్కరోజు వేతనం కట్...

నగరంలోని వినాయక్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఇటీవల డీఈవో అశోక్ ఆకస్మికంగా తనిఖీ సందర్భంగా విధులకు ఆలస్యంగా హాజరైన ఉపాధ్యాయుల ఒక్కరోజు వేతనాన్ని వెనక్కి తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి శుక్రవారం ఆదేశాలు ఇచ్చారు. ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ డిసెంబర్ నెలలో మూడు రోజుల పాటు ఎటువంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు కాగా కాంప్లెక్స్ హెచ్ఎం ఫిర్యాదుతో విచారణ జరిపి హెచ్ఎం మూడు రోజుల వేతనాన్ని కూడా వెనక్కి తీసుకోవాలని డీఈవో ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

ఆలయ అధికారులతో సహాయ కమిషనర్ సమావేశం

నిజామాబాద్ కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో జరగాల్సిన పూజాది కార్యక్రమాలపై ఉమ్మడి జిల్లాకు చెందిన ఆలయ అధికారులతో ఇంచార్జి సహాయ కమిషనర్ శ్రీరాం రవీందర్ గుప్త సమావేశం నిర్వహించారు. శుక్రవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో శివరాత్రి పర్వదినాన ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా చూడాలని సూచించారు. అదే విధంగా ప్రభుత్వం ఆదేశానుసారంగా ఉపవాస దీక్ష చేపట్టే భక్తులకు పండ్లు పంపిణీ చేసే విధంగా చూడాలని అన్నారు. ఏఏ ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో వస్తారో ఆ ఆలయాలను ముందుగానే గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ దేవాలయాల కార్యనిర్వహణ అధికారులు, జూనియర్ అసిస్టెంట్లు, దేవాదాయ ధర్మాదాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న సహాయ కమిషనర్

నగరంలో యువకుడిపై కత్తితో దాడి

ఖిల్లా, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వేస్టేషన్‌లో నిద్రిస్తున్న యువకుడిపై గుర్తుతెలియనివ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటన జరిగింది. నిర్మల్ జిల్లాకు చెందిన బాబు అనే యువకుడు నగరంలో కూలిపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతీరోజు లాగే బుధవారం రాత్రి రైల్వేస్టేషన్‌లో నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి కూడా అతని పక్కనే నిద్రించాడు. బాబు నిద్రలో ఉండగా అతని జేబులోంచి డబ్బులు తీసేందుకు ప్రయత్నించగా బాబుకు మెలుకువ రావడంతో ఆ వ్యక్తితో గొడవ పడ్డాడు. దీనిని గమనించిన అక్కడ విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌కు ఫిర్యాదు చేయగా ఆ దుండగుడిని మందలించి పంపించారు. కొద్దిసేపటికి ఆ వ్యక్తి మళ్లీ వచ్చి తన వద్ద ఉన్న కత్తితో బాబు మెడపై గాయపరిచాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఒకటో టౌన్ ఎస్సై మొగులయ్య రైల్వేస్టేషన్‌కు చేరుకొని బాబును చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. కాగా శుక్రవారం ఈఘటనపై చికిత్స అనంతరం వచ్చిన బాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటోటౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

బినోల విద్యార్థినికి డీఈవో అభినందన

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ బినోల ఉన్నత పాఠశాల విద్యార్థిని కన్నం భవాని అడిగిన ప్రశ్నకు ప్రధాన మంత్రి నుంచి పరీక్ష పే చర్చలో భాగంగా జవాబు వచ్చిందని భారత దేశంలో కొంత మంది విద్యార్థులకు మాత్రమే వచ్చే ఈ అవకాశం జిల్లా విద్యార్థికి రావడంపై జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని భవానిని, గైడ్ ఉపాధ్యాయురాలు సరిత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డిని, ఉపాధ్యాయులను డీఈవో అభినందించారు.

అమర వీర జవాన్లకు నివాళులు

మోపాల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): 2019లో జమ్ము కాశ్మీర్‌లోని పుల్వామాలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 40 మంది జవాన్లు వీరమరణం పొందిన సందర్భంగా మోపాల్ మండలం మంచిప్ప జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మృతి చెందిన జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిలు, జైభారత్ యూత్ అధ్యక్షుడు సాయిరాం, మాజీ వీడీసీ అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ జగదీష్ యాదవ్, చిన్నోల శ్రీధర్, ఫీల్డ్ అసిస్టెంట్ దేవిదాస్, పాఠశాల ఉపాధ్యాయులు ప్రవీణ్, వ్యాయామ ఉపాధ్యాయులు దేవేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌కు క్యాష్ రివార్డు



రివార్డు అందుకుంటున్న పోలీసులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): భారీ గంజాయిని పట్టుకున్న నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి క్యాష్ రివార్డును అందజేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డైరెక్టరేట్ కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న ఆమె టీమ్ సభ్యులకు 30వేల క్యాష్ రివార్డును అందజేశారు. 10వేల క్యాష్ రివార్డును స్వప్నకు, 20వేల క్యాష్ రివార్డును ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ సభ్యులకు అం దజేశారు. ఈ నెల 11వ తేదీన బాన్సువాడ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒడిస్సా నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న 20లక్షల విలువగల గంజాయిని నిజాంసాగర్ వద్ద పట్టుకున్నందుకు నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌కు క్యాష్‌రివార్డుతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఖురీషి, నిజామాబాద్ డిప్యూటీ కమిషనర్ సోమి రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన నాయకులు

ధర్పల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణలపై హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ధర్పల్లి మండల నాయకులతో పాటు జిల్లాస్థాయి నాయకులు హాజరయ్యారు. ఈ ప్రజెంటేషన్‌లో సమగ్ర సమాచారం ఉందని ప్రభుత్వంపై ప్రతి పక్షాలు ఆధారాలు లేని ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కార్యక్రమానికి ఇందల్వాయి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి నర్సయ్య పాల్గొన్నారు.



చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.230	రూ. 250


బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.89300	రూ.82500	రూ.1000

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్
స్క్రీన్-1: కెప్టెన్ అమెరికా(తెలుగు3డి) (10.45, 7.20)
: లైలా (1.25) : తండేల్ (4.15, 10.00)
స్క్రీన్-2:చావా (హిందీ)(10.00, 4.00, 10.25)
: కెప్టెన్ అమెరికా (తెలుగు 3డి) (1.20)
: తండేల్ (7.20)
స్క్రీన్-3 : తండేల్ (10.30)
: నిదిరించు జహాపనా (1.35)
: లైలా (4.10): చావా (హిందీ) (7.00)
: సనం తేరీ కసమ్ (హిందీ) (10.20)
స్క్రీన్-4 : తాలా (10.55)
: సంక్రాంతికి వస్తున్నాం (1.35, 7.40)
: బ్రహ్మ ఆనందం (4.35) : లైలా (10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..
స్క్రీన్-1:చావా (హిందీ) (11.00, 1.40, 10.20)
: తండేల్ (4.35, 7.30)
స్క్రీన్-2 : లైలా (11.00, 1.40, 7.20, 10.20)
: చావా (హిందీ) (4.30)
స్క్రీన్-3 : బ్రహ్మ ఆనందం (11.00, 4.30)
: కెప్టెన్ అమెరికా (తెలుగు 3డి) (1.45, 7.40)
: తండేల్ (10.25)



దేవి: లైలా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : చావా (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : తండేల్ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్